అట్టావా (కెనడా) ఆంధ్రవాహిని - ఆంధ్రజ్యోతి నిర్వహించిన విభవ శ్రీరామనవమి కథల పోటీలో
ప్రథమ బహుమతి రు. 500 గెలుచుకున్న రచన

# మాధురీ మాధవం

కె. గోదావరిశర్మ


''పది'' అంది మాధురి, భర్త రాసుకుంటున్న టేబుల్ దగ్గరకొచ్చి.

''పద'' అన్నాడు మాధవ్. అన్నాడే గాని పెన్ను ముయ్యలేదు, కన్ను తిప్పలేదు.

ఐదు నిమిషాలు మార్జిన్ ఇచ్చింది మాధురి. ఆ తరువాత మరి ఊరుకోలేదు. పరీక్షహాల్లో ఇన్విజిలేటర్‌లాగా అతడు రాస్తున్న కాగితాల్ని బలవంతంగా లాగేసుకుంది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ ముద్దు ముద్దుగా భార్యని విసుక్కున్నాడు మాధవ్.






రాత్రి పది కొట్టగానే లైట్లార్పి పక్కమీదకి చేరుకోవాలని రూల్ పెట్టింది మాధురి. మంచం మీద కొచ్చాక సరససల్లాపాలే తప్ప అతడి ఆఫీసు వ్యవహారాలు, డబ్బు సమస్యలు, ఇంకే ఇతర ఈతి బాధల గురించీ మాట్లాడకూడదని మరో రూలు. కట్టుకున్నవాళ్లే కటువ్బాట్లలో పెట్టకపోతే అతడికీ తనకీ కూడా సుఖం లేదని గ్రహించి అలాంటి ఏర్పాట్లు చేసిందామె.

మాధవ్ ఇంజనీరు. ప్రభుత్వోద్యోగంతో బాధలు పడలేక రిజైన్ చేసి స్వంతంగా కాంట్రాక్టులు చేసుకుంటున్నాడు. మనిషి సవ్యమైనవాడే కాని రసజ్ఞత ఇంచుకే చాలదు. అలాగని విరసుడూ కాదు. ఇంతవరకు ఈస్థటిక్ సెన్స్ పెంపొందే పరిసరాలు ప్రభావాలూ లేవు అతడికి. పెళ్ళయ్యాక అతడి జీవితంలోకి ఆమె వర్క్‌షాప్‌లోకి వసంతంలా ప్రవేశించింది. మాధురి సంస్కృత సాహిత్యంలో ఎమ్మే చదివింది. లలిత కళల్లో అభిరుచి, దానికి తగిన సుకుమార చేతనా గలది. ఆమె శరీరం ఎంత నాజూకో మనసు అంత సున్నితం. భార్యకీ తనకీ గల తేడా త్వరగానే గ్రహించాడు మాధవ్. ఇల్లు నిర్వహించుకోవడంలో ఆమె సమర్థురాలని గమనించి తను జోక్యం చేసుకోవడం మానేశాడు. ఏ పనైనా తను చేసినప్పటికంటె ఆమె చేస్తే అందులో అందం, ఔచిత్యం ఎక్కువగా వుండడమూ గుర్తించాడు. ఆమె తనని సంస్కరించబోతే అడ్డు చెప్పలేదు. భార్యని ఫ్లీజ్ చెయ్యడంలో సరదా, ఉపయోగమూ కూడా కనిపించాయి అతడికి.

శయ్యా రచనలో ప్రత్యేక శ్రద్ధ, నైపుణ్యమూ వున్నాయి మాధురికి. ఆమె సరుపు దులిపి బెడ్ షీటు పరిచి తలగడలు సరిచేసిందంటే ఇక వెర్టికల్‌గా వుండ బుద్ధవదు మాధవ్‌కి. వెంటనే హారిజాంటల్ పొజిషన్ లోకి వచ్చేస్తాడు. అంత ఆకర్షణీయంగా వుంటుంది ఆమె వేసిన పక్క. ఇక పువ్వులు, ఊదొత్తుల వంటి ఉద్దీపకాలు సరేసరి. కవిత్వంలోలాగే జీవితంలోనూ శయ్య ప్రధానమంటుంది ఆమె.

హాయిగా విశ్రమించి, "ఊఁ, కానీ..." అన్నాడు మాధవ్. వడుం వాల్చిన వెంటనే నిద్రపోరు కనక కొంతసేపు సరస, చతుర సంభాషణ సాగిస్తుంది మాధురి. అతడు ఎక్కువగా శ్రోతే అయినా, ఆమెను ప్రోత్సహిస్తాడు. భార్య తన రొటీన్ లైఫ్‌లోకి రుచి, రమ్యత తెచ్చిందని కించిత్ గర్వం కూడా అతడికి.

కిటికీ అవతల బొప్పాయ చెట్టుకేసి చూపించి "ఆ చెట్టుమీద ఏం వుందో చూడండి" అంది మాధురి.

"కాయలు" అన్నాడు మాధవ్ తక్కువ. వెంటనే నాలిక్కరుచుకున్నాడు. భార్య ఆశించిన జవాబు అది కాదని తెలిసిపోతూనే వుంది.

కాని మాధురికి అప్పటికే అలక వచ్చేసింది. "ఛ! మోస్ట్ అన్‌రొమాంటిక్ ఫెలో! మీ ఇంజనీరు కళ్ళతో కాదు, నా కళ్ళతో చూసి చెప్పండి" అంది.

"వెన్నెల" అన్నాడు మాధవ్ బుద్ధిగా.

"రైట్. ఆ వెన్నెల ఆ ఆకుల్లోంచి ఫిల్టర్ అయి, ఈ కిటికీలోంచి జాలువారి, మన మంచం మీద మరో తెల్లటి బెడ్ షీటులా పరుచుకుంటూ వుంటే- ఎంతో బాగుంది కదూ?"

"అవును. చాలా బాగుంది."

"మరి ఈ విషయం నేను మీకు చెప్పకముందే మీరే చూసి నాకు ఎందుకు చూపించకూడదూ?" అని నిలదీసింది మాధురి.

మాధవ్ ఇబ్బందిగా బుర్ర గోక్కున్నాడు. ఇప్పుడు తను ఆమె ఈస్థటిక్ సెన్సిబిలిటీని, సూక్ష్మ పరిశీలనా శక్తిని, వర్ణనా చాతుర్యాన్నీ పొగడాలి. అలా పొగిడించుకోవడం మాధురికి ఇష్టం. అతడికీ అభ్యంతరం లేదు. అందుచేత యథాశక్తి ఆమె సౌందర్య దృష్టిని ప్రశంసించాడు. అది తనకి లేదని కూడా బేషరతుగా ఒప్పేసుకున్నాడు.

"ఏదైనా వుండగానే సరికాదండీ! అనుభవించడం తెలియాలి. ఉన్నదాన్ని గుర్తించడం, ఏది ఎందుకో, దేన్ని ఎలా అనుభవించాలో తెలుసుకోవాలి" అని చిన్న లెక్చర్ చేసింది మాధురి.

దానికీ ఒప్పేసుకున్నాడు భా.వి. భర్త. (అంటే భార్యావిధేయుడైన భర్త)

"ఇలా కిటికీలోంచి వెన్నెల పడడం గురించి సంస్కృతంలో ఒక శ్లోకం వుంది" అంది మాధురి.

"ఉందీ? వుండే వుంటుందిలే. లేకపోతే ఆశ్చర్యం గాని, వుంటే ఆశ్చర్యం ఏముంది? మీ సంస్కృతంలో ప్రతి దానిమీదా ఒక శ్లోకమే" అన్నాడు మాధవ్ భార్యని మరింత సంతోషపెట్టాలని.

"సంతోషించాం గాని, ఓవర్ యాక్షన్ చెయ్యకండి. మీరేం మా సంస్కృతాన్ని పొగడక్కర్లేదు గాని ముందు శ్లోకం వినండి.

*వీథీషు వీథీషు విలాసినీనాం*
*ముఖాని సంవీక్ష్య శుచిస్మితాని*
*జాలేషు జాలేషు కరం ప్రసార్య*
*లావణ్య భిక్షామటతీవ చన్ద్ర!!*

వీధి వీధినా విలాసినుల శుచిస్మితాలైన ముఖాలు చూసి, *గవాక్షాల గుండా కరాన్ని (కిరణాన్ని) చాపి లావణ్య భిక్ష వర్థిస్తున్నట్టుగా వున్నాడట చంద్రుడు. బాగుందా?"*

"బాగుంది."

"ఏం బాగుందో చెప్పండి?"

"లావణ్య భిక్షాటనం అన్నమాట బాగుంది. ఇంకా అదేదో స్మిత అన్నావు-"

"సిల్క్ స్మిత కాదు, శుచిస్మిత". అంది మాధురి కోపం నటిస్తూ.

"అదే అదే. శుచిస్మిత. ఈ సంస్కృతం ముక్కలు వెంటనే నోరుతిరగవు, గుర్తుండవు చూడు! కాని 'శుచిస్మిత' అన్న పదం బాగుంది కదూ?"

"అంత బాగుంటే మీకు అమ్మాయి పుడితే ఆ పేరే పెట్టుకోండి" అంది మాధురి. అనేసింది గాని వెంటనే సిగ్గుపడి భర్త గుండెల్లో ముఖం దాచుకుంది.

ఆ తరువాత వాళ్ళు ఆ గదిలో ఏం చేసేరో మనకు తెలియదు. బొప్పాయచెట్టు మీద వెన్నెల అంతా చూస్తుంది కాని మనకి ఏమీ చెప్పదు.

* * *

మరునాడు ఆదివారం.

చేసేది ప్రభుత్వోద్యోగం కాకపోయినా మొగుణ్ణి ఆదివారం బయటికి వెళ్ళనివ్వదు మాధురి. మరీ అంతగా పని వుంటే గంటో రెండు గంటలో ఇంట్లోనే కాగితాలు చూసుకుంటాడు గాని లుంగీలోంచి ప్యాంటులోకి మారడు మాధవ్.

కాని ఆ ఆదివారం బోర్ అయిపోయింది. రోజులో చాలా భాగం పవర్ ఫెయిల్యూర్ వల్ల టీవీ పనిచెయ్య

లేదు. ఊళ్ళోకెళ్ళి సినిమా చూద్దామంటే అంత శ్రమపడి చూడదగ్గ చిత్రాలేవీ లేవు. ఉదయం ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కలిసి వంట చేసుకుని కలిసి తిన్నారు. మధ్యాహ్నం బయట ఎండ, లోపల ఫ్యాన్ లేకపోవడం వల్ల ఉక్క. వేసవిలో కరెంటు కోత ప్రభుత్వ అసమర్థతకి నిదర్శనం. కాని మెజారిటీ నిరక్షరాస్యులైన ప్రజలు ఉండగా వుండగా ఏ ప్రభుత్వమైనా నిస్సంకోచంగా అవినీతికి, అలసతకీ అలవాటు పడుతుంది కదా! ఆలోచనాపరులు, అడిగేవాళ్ళు మైనారిటీలైన దేశానికి ఉత్తమ గతులు ఎలా సిద్ధిస్తాయి?

ఏదో పత్రిక తిరగేస్తూ నిద్రలోకి జారింది మాధురి. లేచి చూసేసరికి మాధవ్ సీరియస్‌గా ఏదో పుస్తకం చదువుతున్నాడు. మాధురి లేచిన అలికిడి విని తల తిప్పి చూసి, పలకరింపుగా చిరునవ్వు నవ్వి, దీర్ఘంగా నిశ్వసించి, "జగమే మాయ" అన్నాడు క్లుప్తంగా.

"అదేమిటా తాగుబోతు మాటలు హఠాత్తుగా?" అని కంగారుపడింది మాధురి.

"దేవదాసే కాదు, శంకరాచార్యులు కూడా జగత్తు మిథ్య అని చెప్పేరట కదా! తాగుబోతు మాటలంటావేం?" అన్నాడు మాధవ్.

"నిజమే గాని వున్నట్టుండి మీకీ వేదాంతం ఏమిటండీ?" అంది మాధురి నిద్రమత్తు పూర్తిగా దిగిపోగా.

మళ్ళీ మరోసారి నిట్టూర్చేడు మాధవ్. "నువ్వీ పుస్తకం చదివేవా?" అని చేతిలో పుస్తకం ఎత్తి చూపించేడు.

అది 'వేదాంత సారము' అన్న గ్రంథం. వివిధ హిందూ దార్శనికులు, తత్త్వవేత్తల ఉపదేశాలన్నీ సంకలనం చేసి పొందుపరిచేరు.

"చదివాను ఏం?" అంది మాధురి.

"మరి, చదివిన ప్రభావం ఏమీ లేదా నీ మీద?"

"బాగుంది. ఆ పుస్తకం చదవగానే అందరూ వైరాగ్యం తెచ్చుకుని సన్యాసుల్లో కలిసిపోతారా ఏమిటి?"

మాధవ్ భార్యవంక ఆశ్చర్యంగా చూశాడు. "పుస్తకాలు చదివితే చాలదు, అందులో విషయాలు వంటపట్టించుకోవాలని, ఆచరించాలనీ నువ్వే చెపుతుంటావు మరి? ప్రబంధాలూ, ప్రేమ కథలూ చదివి మనమూ అలా వుండాలంటావు కదా, వేదాంతం మాత్రం చదివి ఊరుకోవాలా? సీరియస్‌గా తీసుకోవద్దూ?" తన అయోమయాన్ని సిన్సియర్‌గానే వ్యక్తం చేశాడు.

"వేదాంతం కూడా సీరియస్‌గానే చదవండి. కాని ఆచరించడానికి ఇంకా సమయం వుంది. యౌవనంలో ఐహిక సుఖాలు అనుభవించడమే ఉచితం" ఓపిగ్గా చెప్పింది మాధురి.

"మరి బుద్ధుడు, శంకరాచార్యుడు, ఏసుక్రీస్తు- వీళ్ళంతా యౌవనంలోనే ఆధ్యాత్మిక విషయాలు బోధించేరట కదా?"

"అది వేరు. వాళ్ళు మహానుభావులు. మనం మామూలు మనుషులం."

"అలా అనగానే సరిపోతుందా? ఆ ఒక్క మాటతో మన బలహీనతలన్నీ సమర్థించుకోవడమేనా?"

భర్త ఈ మాత్రమైనా సీరియస్ విషయాల గురించి ఆలోచించడం, మాట్లాడ్డం మాధురికి ఆనందంగానే వుంది. కాని ఆమె స్వభావతః వాదోపవాదాలకు దూరంగా వుంటుంది. నిస్సారమైన చర్చల కంటె నిజమైన అనుభవం గొప్పదని ఆమె అభిప్రాయం. అంచేత మాధవ్‌తో వాదన పెంచుకోక, అతడి సందేహాన్ని కార్యరూపంలో తీర్చాలని నిశ్చయించుకుంది.

"సరే, మహానుభావా! నిద్ర లేచి టీ అయినా తాగకుండా మధ్యాహ్నం వేళ ఈ మిథ్యావాదం ఏమిటి? కాసేపు ఆ వేదాంతం పక్కన పెట్టి పకోడీలు వెయ్యమంటారా, బజ్జీలు వెయ్యమంటారా చెప్పండి" అంది.

తను సీరియస్‌గా మాట్లాడుతున్న విషయం ఆమె తుంచేసి మాట మార్చడం పట్ల మాధవ్ కొంచెం నొచ్చుకున్నా బయటికి ఏమీ అనలేదు. "నీ యిష్టం" అన్నాడు ముభావంగా.

ఆమె పరిస్థితి గమనించి అతణ్ణి చెయ్యి పట్టుకు లేవదీసి వంటింట్లోకి తీసుకువెళ్ళింది.

మధ్యాహ్నం సాయంకాలంలోకీ, సాయంకాలం రాత్రిలోకీ మారినకొద్దీ ఉక్క, వేడి తగ్గి వాతావరణం చల్లబడింది. స్నానం చేసి వచ్చి ఫ్రెష్‌గా పౌడరు రాసుకుని తెల్లటి ఇస్త్రీ బట్టలు కట్టుకుని భార్య ఇచ్చిన కూల్ డ్రింక్ తాగేక మాధవ్ కూడా బాగా చల్లబడ్డాడు. అయితే ఆమె కూడా స్నానం చేసివచ్చి తెల్లచీర కట్టుకున్నాక, వీధిలోకి అమ్మవచ్చిన మల్లెమొగ్గలు కొని గాజు పళ్ళెంలో అమర్చాక, అంతలోకే ఉదయించిన నిండు చంద్రుణ్ణి చూశాక, అతడు కొంచెం వెచ్చబడ్డాడు.

హాల్లో ఫ్యాను క్రింద పడక్కుర్చీ వేసి అతణ్ణి ఆసీనుణ్ణి చేసి, అతడి పక్కనే చాప వేసుక్కూచుని మల్లెమొగ్గలు మాల కట్టింది మాధురి. అది పూర్తయ్యాక తను కొంత జడలో పెట్టుకుని వాసన చూడడానికి అతడికి కొంత ఇచ్చింది.

అప్పుడు పుస్తకాల షెల్ఫులోంచి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథల సంపుటి ఒకటి తీసి 'షట్కర్మయుక్తా' అన్న కథ చదివి వినిపించింది. మాధవ్‌కి అదొక కొత్త అనుభవం. శ్రీపాదవారి భాష, పాత్రలు, వాటి మాట తీరు, చమత్కారం- ఇవన్నీ అతడిని గిలిగింతలు పెట్టాయి. మాధురి ఆ కథని ఎలా చదవాలో అలా చదివింది మరి!

కథ చివర్లో ఈ వాక్యాలున్నాయి:

*"అదృష్టవంతుడైన మొగవాడికి, భోజనం చేసి లేచేటప్పటికే తమలపాకుల చిలక అందించే పెళ్ళాం దొరుకుతుంది."*

*"పెట్టి పుట్టిన ఆడదానికి, తనతో కలిసి తాంబూలం వేసుకునే మొగుడు దొరుకుతాడు."*

ఆమె ఈ వాక్యాలు చదివి కథ ముగించగానే అతడు మరి ఆలస్యం చెయ్యకుండా, "లే, లే. భోంచేద్దాం. మన అదృష్టాలు పరీక్షించుకోవాలి" అన్నాడు.

"అంత తొందర ఏమిటండీ? అప్పుడే భోంచేసి ఏం చెయ్యాలి?" అని సాగదీసింది మాధురి.

"నీతో పనుంది" అన్నాడు మాధవ్ చిలిపిగా.

"అలాగా! మధ్యాహ్నం తమరేదో వేదాంతం, వైరాగ్యం, సన్యాసం అంటూ ఏదేదో మాట్లాడినట్టున్నారు! పోనీ కొంతసేపు ఆ చర్చ కొనసాగిద్దామా?" అంది మాధురి మరీ చిలిపిగా.

"అబ్బ, వద్దులెద్దూ! చందన చర్చల వయసులో వేదాంత చర్చలేమిటీ!" అన్నాడు మాధవ్.

"అలా రండి దారికి" అంటూ లోనికి దారితీసింది మాధురి.

---

**ఆంధ్రజ్యోతి**
సచిత్ర వారపత్రిక

## అట్టావా (కెనడా) ఆంధ్ర వాహిని
## 1988 విభవ శ్రీరామ నవమి కథానికల పోటీ ఫలితాలు

అట్టావా కేంద్రంగా ప్రవాసాంధ్రులు వెలువరిస్తున్న ఆంధ్ర వాహిని పత్రికవారు ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక ద్వారా నిర్వహించిన శ్రీరామనవమి కథల పోటీలో అధిక సంఖ్యలో రచయితలు, రచయిత్రులు పాల్గొన్నారు. ఈ పోటీకి న్యాయ నిర్ణేతలుగా శ్రీయుతులు కొండముది హనుమంతరావు, ప్రయాగ రామకృష్ణ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ (విజయవాడ) గారలు వ్యవహరించారు.

మొదటి బహుమతి రూ.500/-లు
గెలుచుకున్న కథ
**మాధురీ మాధవమ్:**
—కె.గోదావరిశర్మ, కాకినాడ

రెండవ బహుమతి రూ.300/-లు
గెలుచుకున్న కథ
**అడవి గోల:**
—అంగర సూర్యారావు, విశాఖ

మూడవ బహుమతి రూ.200/-లు
గెలుచుకున్న కథ
**మహా నగరంలో మానవత**
—సి.తా.రె.
కె.జె.ఎస్.రామారెడ్డి, తణుకు

విజేతలకు మా శుభాకాంక్షలు
న్యాయ నిర్ణేతలకు మా కృతజ్ఞతలు
ఈ పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నిక చేసిన కథల జాబితాను తర్వాత ప్రకటిస్తాము.

—ఎడిటర్